క్లుప్తంగా

104 సేవలు సద్వినియోగం చేసుకోవాలి


రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన 104 శిబిరాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. సీహెచ్‌వో దేవకాంత, వైద్య సిబ్బంది వైద్యసేవలందించి, మందులు పంపిణీ చేశారు.

రామాలయం నిర్మాణానికి భూమిపూజ


రామాలయం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో రామాలయం నిర్మాణానికి బుధవారం భూమి నిర్వహించారు. ఈకార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ వైరు

తప్పిన ప్రమాదం


రోడ్డు మీద పడిన విద్యుత్ వైరు

మునగపాక: మండలంలోని తోటాడ కాశీమాత ఆలయం వీధిలో బుధవారం ఓ విద్యుత్ వైరు తెగిపడింది. కుళాయి నీరు పడుతున్న మహిళలు గమనించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న లైన్‌మేన్ రాము విద్యుత్ సరఫరాను నిలుపుదల చేసి, కొత్త వైరు ఏర్పాటు చేశారు.ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

వాలీబాల్‌పోటీలు ప్రారంభం


పోటీలో తలపడుతున్న జట్లు

నక్కపల్లి: మండలంలో ఉపమాక శివారు కొండవెనుక పాలెంలో జీసీఎం చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో వాలీబాల్‌పోటీలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. సంస్థ వ్యవస్థాపకుడు గెద్దాడ ప్రవీణ్ రత్నకుమార్,డైరెక్టర్ ఇందిరా దేవిలు ఈ పోటీలను ప్రారంభించారు. పాయకరావుపేట నియోజకవర్గంనుంచి 22 టీములు ఈ పోటీల్లో పాల్గొంటున్నట్లు వారు చెప్పారు ఈ పోటీలను ఆర్గనైజర్లు రాజు, యోహాన్‌ను పర్యవేక్షిస్తున్నారు.

విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలు


పేపర్‌క్రాఫ్ట్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

రాంబిల్లి: దిమిలి శాఖా గ్రంథాలయంలో బుధవారం వేసవి శిక్షణ శిబిరం కొనసాగింది. రీసోర్స్‌పర్సన్ టి. వెంకటలక్ష్మి, లైబ్రేరియన్ ఎస్. శకుంతల విద్యార్థులకు పేపర్ క్రాఫ్ట్ పోటీలు నిర్వహించారు. చదవడం, రాయడం నేర్పించారు. నీతికథలు చెప్పారు. ఈ నెల 10వ తేదీతో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ముగుస్తాయని లైబ్రేరియన్ శకుంతల తెలిపారు.

ఇరు వర్గాలపై బైండోవర్

యలమంచిలి: పెదపల్లి గ్రామంలోని సర్వే నంబర్ 286-2బిలో రెండున్నర ఎకరాలకు సంబంధించిన వివాదంలో పెదపల్లి,విశాఖపట్నానికి చెందిన ఇరువర్గాలపై పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. తహసీల్దార్ రాణీ అమ్మాజీ సమక్షంలో కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ సన్నిబాబు బుధవారం తెలిపారు.

ఈదురు గాలుల బీభత్సం

అంధకారంలో యలమంచిలి


యలమంచిలి ప్రధాన రహదారిలో కూలిన చెట్లు


అచ్యుతాపురం మండలం మల్లవరం పరిసరాల్లో నేలవాలిన అరటి చెట్లు


పక్కకు ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది


చినకలవలాపల్లిలో కూలిన రేకుల షెడ్డు

యలమంచిలి: పట్టణంలో మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు పడడంతో కొన్ని చోట్ల భవనాలు దెబ్బతిన్నాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో బుధవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడి, స్థానికులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. విద్యుత్,మున్సిపల్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.

రాంబిల్లిలో

రాంబిల్లి: ఈదురుగాలులు బీభత్సం సృష్టించడంతో గ్రామాల్లో నష్టంవాటిల్లింది. మంగళవారంరాత్రి వీచిన గాలులకు రాంబిల్లి, పెదకలవలాపల్లి, నారాయణపురం గ్రామాల సమీపంలో ఐదు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలుచోట్ల చెట్లుకూలాయి. ఇళ్లపై రేకులు ఎగిరిపోయాయి. మంగళవారంరాత్రి నుంచి బుధవారం సాయంత్రం వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యు త్‌సరఫరా లేకపోవడంతో పలు గ్రామాల్లో తాగు నీరు సరఫరా నిలిచిపోయింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విద్యుత్‌శాఖ అధికారులు యుద్ధప్రాతిపదికన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం

అచ్యుతాపురం(అనకాపల్లి): రెండు రోజులుగా వీస్తున్న ఈదురు గాలులకు అచ్యుతాపురం మండలంలో ఉద్యాన పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. ప్రధానంగా అరటి చెట్లు ఒరిగిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. నష్టాన్ని అంచనా వేసేందుకు ఉద్యాన శాఖకు చెందిన అధికారులు మండలంలోని పర్యటించారు. రైతులకు న్యాయం చేయాలని మల్లవరం సర్పంచ్ పిన్నమరాజు వాసు అధికారులను కోరారు.

వలంటీర్లకు సత్కారం


సత్కారం పొందిన వలంటీర్లు

మునగపాక: ప్రజలకు మెరుగైన సేవలందించడంలో వలంటీర్ల పాత్ర వెలకట్టలేనిదని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద వలంటీర్లను సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు,ప్రభుత్వానికి మధ్య వలంటీర్లు వారధులుగా పనిచేయాలని, సంక్షేమ పథకాల అమలులో చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ,ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,బోడకుర్తి గణేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఎంపీడీవో ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ కళలు, చేతి వృత్తులకు పెద్దపీట


కుండల తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): గ్రామీణ కళలు, చేతి వృత్తుల అభివృద్ధికి ఉన్నత్ భారత్ అభియాన్ పెద్దపీట వేస్తోందని భారత్ అభియాన్ ఆంధ్ర విశ్వ విద్యాలయం కోఆర్డినేటర్ పావని తెలిపారు. అచ్యుతాపురం మండలం తంతడి గ్రామంలో ప్రశాంతి పాలిటెక్నిక్, ఆంధ్ర యూనివర్సిటీ ఆధ్వర్యంలో కుండల తయారీపై అవగాహన కల్పించారు.ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు,ఎన్ఎస్ఎస్ అధికారి మాధవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


బోరు ఏర్పాటుకు భూమిపూజ చేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు అన్నారు. స్థానిక ఇందిరమ్మ కాలనీలో బోరు ఏర్పాటుకు బుధవారం భూమిపూజ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునగపాక పంచాయతీలో సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ,వార్డు సభ్యులు రామచంద్రరావు, దాడి పోలీసు, ఇందరమ్మ కాలనీ సంఘ అధ్యక్షుడు ఆడారి వెంకటప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసిద్ధి పీహెచ్‌సీ భవనం ప్రారంభోత్సవం


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పీహెచ్‌సీ

ఎస్.రాయవరం: మండలంలోని సర్వసిద్ధిలో నిర్మించిన నూతన పీహెచ్‌సీ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రూ.1.87 కోట్లతో నాడు - నేడు కార్యక్రమంలో ఈ భవనాన్ని నిర్మించారు.

జాబ్‌కార్డుదారులందరికీ పనులు


కాగితలో ఉపాధి పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

నక్కపల్లి: జాబ్‌కార్డుకలిగిన వారందరికీ పనులు కల్పించాలని ఎంపీడీవో సీతారామరాజు ఆదేశించారు.మండలంలోని కాగితలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఇక్కడ పనిచేస్తున్నవారి నుంచి వివరాలు సేకరించి, మస్తర్లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఫీల్డ్ అసిస్టెంట్లనుద్దేశించి మాట్లాడుతూ పనులు జరిగే ప్రాంతాల్లో తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా కూలీలకు రూ.272లు వేతనం గిట్టుబాటు అయ్యేవిధంగా పనులు కేటాయింపు జరగాలన్నారు. ఆన్‌లైన్ మస్తరు విధానాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు. పనులు ప్రారంభమైన తర్వాత ఫొటోలను, కూలీల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. పనుల కేటాయింపు, వేతనాల విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కూలీలకు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏపీవో ఈశ్వరరావు పాల్గొన్నారు.

మార్కెట్ అభివృద్ధికి కృషి


సమావేశంలో మాట్లాడుతున్న పలకా యశోద

అనకాపల్లిటౌన్ : అనకాపల్లి మార్కెట్‌యార్డు తూర్పు భాగంలో ప్రహరీ నిర్మాణం, నిర్వహణ నిమిత్తం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయాలని కోరుతూ అమరావతి వ్యవసాయ మార్కెట్ కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపినట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. అనకాపల్లి, కశింకోట మండలాల్లోని 10 గ్రామాల్లో అవసరమైన మేరకు మెటల్ రోడ్డు ఒక్కంటికి రూ.2 లక్షల చొప్పున రూ.20 లక్షలు వెచ్చించాల్సి ఉందన్నారు. దశల వారీగా మార్కెట్ అభివృద్ధికి చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు బెల్లాన్ని తీసుకువచ్చే రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి డి.శకుంతల, కమిటీ సభ్యులు సీటిపల్లి లక్ష్మి, మర్రిపల్లి శోభ, శ్యామల, నూకరత్నం, అప్పలరాజు, రమేష్‌గుప్తా, విజయకుమారి, మోదిబాబు, కుమార్ వరాహకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేట మెయిన్ రోడ్డు నిర్మాణానికి చర్యలు


పాయకరావుపేట మెయిన్ రోడ్డు

పాయకరావుపేట: పట్టణంలోని మెయిన్‌రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. గౌతమ్ థియేటర్ నుంచి బైపాస్ సెంటరు వరకు కిలోమీటరున్నర పొడవున రోడ్డు నిర్మాణానికి డీఎంఆర్‌డీఏ అధికారులు పరిశీలన చేస్తున్నారు. రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ పరిధిలో ఉన్న ఈ రోడ్డును వీఎంఆర్‌డీ పరిధిలోకి గతంలో తీసుకొచ్చారు. అప్పట్లో రోడ్డు విస్తరణకు రూ.4.5 కోట్లు మంజూరయ్యాయి. కొన్నిఆటంకాలతో ఈ ప్రక్రి యనిలిచిపోయింది. అనంతరం మళ్లీ రూ.5.6 కో ట్లు మంజూరయ్యాయి. కానీ రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న చిరువర్తకులు సంఘంగా ఏర్పడి రోడ్డు విస్తరణ కారణంగా తాము ఉపాధి కోల్పోతామని, తమకు న్యాయం చేయాలని కోర్టును ఆశ్రయించారు. దీంతో రోడ్డు విస్తరణ మళ్లీ నిలిచిపోయింది. మంజూరైన నిధులు వెనక్కి మళ్లినట్లు అధికారులు తెలిపారు. ఉపాధికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా రోడ్డునిర్మాణం చేయా లని హైకోర్టు ఆదేశాలు ఇవ్వడంతో విస్తరణ ప్రశ్నార్థకంగా మారింది. రోడ్డు నిర్మాణం జరగకపోవడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారు. ఈవిషయాన్ని కలెక్టర్, వీఎంఆర్ డీఏ అధికారుల దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మా ణానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కోరారు. స్పందించిన కలెక్టర్ విస్తకరణకు ఆటంకాలు ఉన్నందున రోడ్డు నిర్మానానికి అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. దీంతో వీఎంఆర్‌డీఏ ఈఈ తాతాజీ, ఏఈ రవిశంకర్‌లు రోడ్డు వెడల్పు, రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను పరిశీలించారు. రోడ్డును ఒక లేయర్‌తో నిర్మించేందుకు అంచనాలు తయారు చేస్తున్నట్టు వీఎంఆర్‌డీఏ ఏఈ రవిశంకర్ తెలిపారు.

29న సీనియర్ సిటిజన్ సంఘ ఎన్నికలు


సమావేశంలో మాట్లాడుతున్న వెంపరాల నారాయణరావు

అనకాపల్లిటౌన్ : సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికలు ఈ నెల 29న ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలో నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంపరాల నారాయణరావు అన్నారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.వి.గౌరీపతి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అసోసియేషన్ కార్యదర్శి కె.రామచంద్రరావు మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో వృద్ధులు ఇబ్బందులు పడకుండా నిపుణులతో మాట్లాడి, పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయి కార్యవర్గంలో నిజాయితీగా వృద్ధుల కోసం పనిచేసే వ్యక్తులను మాత్రమే ఎన్నుకోవాలని కోరారు. అనంతరం అసోసియేషన్ సభ్యుడు నారాయణరావుని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బీఎల్ఎన్ శర్మ, సభ్యులు ఎస్‌వీబీ స్వామి, పి.బాబూరావు, నల్లల దేముళ్లు, విల్లూరి సత్యనారాయణ, మద్దాల కూర్మారావు, కుండల రామకృష్ణ, ఎం.వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ కూచిపూడి పోటీలకు జాహ్నవి

అనకాపల్లిటౌన్ : స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని మండా జాహ్నవి కూచిపూడి నాట్య పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్ణాటకకేంద్రంగా అంతర్జాతీయ మ్యూజీషియన్స్, డ్యాన్సర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఆన్‌లైన్ ద్వారా ఈ పోటీలు జరుగుతాయన్నారు. సాధారణ కుటుంబంలో పుట్టి, నాట్యంపై మక్కువతో అంచెలంచెలుగా ఎదుగుతున్న జాహ్నవి, ఈ పోటీల్లో గెలుపొందాలని ఆయన ఆకాంక్షించారు.

'మట్టి వినాయకున్నే పూజించాలి'

అనకాపల్లిటౌన్:ఈ ఏడాది సెప్టెంబర్19న జరిగే వినాయకనవరాత్రుల ఉత్స వాల్లో మట్టి వినాయకులను పూజించి, పర్యావరణ పరిరక్షణకు భక్తులు సహకరించాలని వినాయక నిమజ్జనోత్సవ అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఆడారి కుమారస్వామి అన్నారు. స్థానిక ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ యార్డులో లక్ష్మీ గణపతి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించి, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను పూర్తిగా నిషేధించాలని భక్తులను కోరారు. భావితరాలప్రజలను దృష్టిలో పెట్టుకుని పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అసోసియేషన్ సభ్యులు రేబాక మధు, పరదేశినాయుడు,సుబ్రహ్మణ్యశర్మ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

'గడపగడపకు మన ప్రభుత్వం' లో ఎమ్మెల్యే బాబూరావు


రామచంద్రపురంలో లబ్ధిదారులకు బ్రోచర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఆయనకు మళ్లీ మీరు ఆశీసులు అందించాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ప్రజలను కోరారు. రామచంద్రపురంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు ఎలా అందుతున్నవీ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలతో ఆ కుటుంబాలకు ఎంత లబ్ధి కలిగిందో వివరించారు. ఈ సందర్భంగా హారతులిచ్చి ఎమ్మెల్యేకు మహిళలు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నవరత్నాలు ప్రతి కుటుంబంలో వెలుగులు నింపుతున్నాయన్నారు. చిరు వ్యాపారులను, కులవృత్తుల వారిని, మహిళలను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా చంద్రబాబుకు మళ్లీ బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రజల క్షేమాన్ని కాంక్షించే జగన్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎ స్.సీతారామరాజు, సర్పంచ్‌లు చవ్వాకుల కుమారి, చీకట్ల జగదీష్, గోపాలకృష్ణ, ఎంపీటీసీ పెట్ల రాంబాబు, పార్టీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, ఆర్.ఎస్. నారాయణమూర్తి, శ్రీపతిరాజు, గెంజి వెంకటరమణ, చవ్వాకుల చిన్న, పులి చంటి, ఉగ్గిన ఈశ్వరరావు, శానా పతి రామునాయుడు, చీకట్ల వెంకట్, కొమారు రమణ, మండల బూత్ కమిటీ కన్వీనర్ ఎస్.వి.రమణమూర్తి, ఎంపీడీవో చంద్రశేఖర్, డీటీ సోమశేఖర్, ఎస్ఐ నారాయణరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఎంపీపీ గోవింద్


పులపర్తి హైస్కూల్లో కొబ్బరి మొక్క నాటుతున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు.మండలంలోని పులపర్తిలో బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో సుమారు ఆరు వేల మొక్కలు నాటిస్తున్నట్టు చెప్పారు. చెరువు గట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, సీసీరోడ్లకు ఇరువైపులా ఈ మొక్కలు నాటుతున్నట్టు చెప్పారు. రేగుపాలెంలో శ్మశాన వాటిక వద్ద మంచి నీటి బోరు ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదవావు,పులపర్తి గ్రామ సర్పంచ్ సుంకర కొండబాబు, రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు సిద్దా నూకేశ్వరావు, ఈవోపీఆర్‌డీ దీపిక,పంచాయతీ కార్యదర్శి రామకోటి తదితరులు పాల్గొన్నారు.

లారీ నుంచి జారిపడిన బండరాయి

త్రుటిలో తప్పిన ప్రమాదం


రాళ్లు తరలిస్తున్న లారీ ఇదే


లారీ నుంచి జారిపడిన రాయి

మునగపాక: పూడిమడక రోడ్డులో పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి.మండలంలోని మెలిపాకకు చెందిన మహిళా పోలీసు గంగాభవాని, మరోముగ్గురు అనకాపల్లిలో ఆటో ఎక్కారు. మునగపాక పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహించేందుకు గంగాభవానీ వస్తుండగా, మిగతావారు హరిపాలెం వెళ్లేందుకు బయలుదేరారు. పూడిమడక రోడ్డులో మార్గమధ్యంలో ఆటోకు ముందు రాయిలోడుతో వెళుతున్న లారీ లోంచి ఓ పెద్ద రాయి ఆటో ముందు పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. క్షణం ఆలస్యమైతే రాయి నేరుగా ఆటోమీద పడేదని వారు చెప్పారు. మహిళా పోలీసు గంగాభవాని సంబంధిత లారీని స్టేషన్‌కు తరలించి మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూడిమడక రోడ్డులో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేలా చూడాలని పలువురు కోరురారు.

ఇంగ్లిష్‌లో కథలు చెప్పడంపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): ఇంగ్లిష్‌లో కథలు చెప్పడంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం ఈమేరకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన జల్ జీవన్ పనులు

ఎమ్మెల్యే గొల్ల బాబూరాబు


పనుల పై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

కోటవురట్ల: జల్ జీవన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అధికారులను ఆదేశించారు. ఈ పనులపై మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు,కాంట్రాక్టర్లతో ఎమ్మెల్యే బుధవారం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రూ.23.27 కోట్లతో జల్ జీవన్ మిషన్ పనులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆర్ డబ్ల్యూఎస్ డీఈ వై.ఆనంద్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 10 గ్రామాల్లో పనులు పూర్తికాగా, 30 గ్రామాలకు సంబంధించి టెండర్ల దశలో ఉన్నట్టు తెలిపారు. మిగతా గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, జెడ్పీటీసీ సిద్దాబత్తుల ఉమాదేవి, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్దాబత్తుల సత్యనారాయణ, ఎంపీడీవో చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరుణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

కశింకోట : ఈదురు గాలులకు విరిగిన, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేసి, విద్యుత్ సరఫరాను పూర్తిస్థాయిలో పునరుద్ధరించినట్టు ఏపీఈపీడీసీఎల్ ఏఈ కె.రాజ్‌కుమార్ బుధవారం మీడియాకు తెలిపారు. మంగళవారం రాత్రి తీవ్రగాలులతో కురిసిన వర్షాలకు విద్యుత్ లైన్లపై చెట్లు, కొమ్మలు విరిగి పడ్డాయి. దీంతో మండలంలోని తాళ్లపాలెం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, కన్నూరుపాలెం, తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగి, సరఫరాకు అంతరాయం ఏర్పడిన విషయం తెలిసిందే. సంగతి తెలిసిందే. నూతలగుంటపాలెంలో 6, సోమవరంలో 2, జెట్టపురెడ్డితుని, ఏఎస్ పేట, అచ్చెర్లలో ఒక్కొక్కటి చొప్పున స్తంభాలు విరిగిపడినట్టు అధికారులు వెల్లడించారు. వీటిని యుద్ధప్రాతిపదికను పునరుద్ధరించామన్నారు. వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాల్సి ఉందన్నారు. చింతలపాలెంలో మూడు హెచ్‌టీ లైన్ స్తంభాలతోపాటు, పలు గ్రామాల్లో సుమారు 20 వరకు వ్యవసాయ లైన్ విద్యుత్ స్తంభాలు విరిగినట్టు తెలిపారు. వీటిని త్వరితగతిన పునరుద్ధరించి, గురువారంలోగా విద్యుత్ సరఫరాను అందించనున్నట్లు వెల్లడించారు.